సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం ¦ 7 ¦ జూన్ ¦ 2023



చీనీ టన్ను రూ.40 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి. మార్కెట్‌కు 633 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



1,101 మంది గైర్హాజరు
పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన గణితం పరీక్షకు 1,101 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 58 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు.



జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

కల్యాణోత్సవానికి పేర్లు నమోదు చేసుకోండి



కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 13, 14, 15, 16, 19, 20, 21, 22, 23, 25, 26, 27, 28, 30వ తేదీల్లో శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవాలు ఉంటాయన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10.30 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని, ఒక రోజుకు 5 కల్యాణసేవ టిక్కెట్లు మాత్రమే జారీ చేస్తామన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.4 వేలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక్కో టికెట్‌పై ఐదుగురిని మాత్రమే అనుమతిస్తామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇన్‌చార్జ్ డీఈఓగా రంగస్వామి

ప్రశాంతి నిలయం: జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓగా పెనుకొండ డిప్యూటీ డీఈఓ రంగస్వామిని నియమిస్తూ కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఈఓ మీనాక్షి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆమె బాధ్యతలను రంగస్వామికి అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం రంగస్వామి బాధ్యతలు తీసుకోనున్నారు. మీనాక్షి కోలుకుని విధులకు హాజరయ్యే వరకు ఆయన ఇన్‌చార్జ్ డీఈఓగా వ్యవహరించనున్నారు.

ముగిసిన హెచ్‌ఎంల వెబ్ ఆప్షన్లు




డీఈఓతో మాట్లాడుతున్న పీడీ సంఘం నేతలు

రాప్తాడు రూరల్: ఉపాధ్యాయ బదిలీల ఘట్టం చివరి దశకు చేరుతోంది. కీలకమైన ఆప్షన్ల ప్రక్రియ మొదలైంది. మంగళవారం సాయంత్రం 7.30 గంటలకు ప్రధానోపాధ్యాయుల ఆప్షన్ల ప్రక్రియ ముగిసింది. మొత్తం 263 ఖాళీలను చూపించారు. 218 మంది హెచ్‌ఎంలకు తప్పనిసరి బదిలీ ఉండగా, 90 మంది రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేశారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల వెబ్ ఆప్షన్లు మొదలయ్యాయి. నేటి(బుధవారం)తో స్కూల్ అసిస్టెంట్ల ఆప్షన్లు, ఈ నెల 8తో ఎస్జీటీల ఆప్షన్లు ముగియనున్నాయి.

పొరపాట్లను సరిదిద్దండి..

పీడీ పోస్టుల ఖాళీలను చూపించడంలో సిబ్బంది చేసిన తప్పిదాలను సరిదిద్దాలని ఫిజికల్ డైరెక్టర్ల (పీడీ)సంఘం నాయకులు.. డీఈఓ సాయిరాంకు విన్నవించారు. శింగనమల మండలం ఆకులేడు స్కూల్‌కు ఒక పీడీ పోస్టు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, అక్కడ ఇవ్వకుండా తరిమెల స్కూల్‌కు అదనంగా రెండో పోస్టు ఇచ్చారన్నారు. హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయిన కమ్మూరు, కోన ఉప్పలపాడు, మాల్యవంతం పాఠశాలలకు పీడీ పోస్టు ఖాళీగా చూపించాలని కోరారు.

ఇక చక్కటి భోజనం



తరగతుల వారీగా పెరిగిన మెస్ చార్జీల వివరాలు

తరగతి	హాస్టల్ గ్రేడ్	2018లో	2023లో పెరిగిన చార్జీలు
3, 4	ప్రీ మెట్రిక్ హాస్టళ్లు	రూ.1,000	రూ.1,150
5 నుంచి 10	ప్రీ మెట్రిక్ హాస్టళ్లు	రూ.1,250	రూ.1,400
ఇంటర్ ఆపైన	పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు	రూ.1,400	రూ.1,600

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న వైఎస్ జగన్ సర్కార్... సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులకు కమ్మని భోజనం వడ్డించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచింది. ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన చార్జీలు అమలు కానుండగా, విద్యార్థికి కొత్తమెనూతో పోషకాలతో కూడిన భోజనం అందనుంది.

- డైట్ చార్జీలు పెంచిన జగన్ సర్కార్
- ఈ నెల 12వ తేదీ నుంచి అమలు
- జిల్లాలోని 27 హాస్టళ్ల విద్యార్థులకు లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పుట్టపర్తి: ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులకు జగన్ సర్కార్ శుభవార్త చెప్పింది. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచింది. ఫలితంగా నూతన మెనూతో కూడిన పోషకాలతో కూడిన భోజనం హాస్టల్ విద్యార్థులకు అందనుంది. నిత్యావసరాల ధరలు పెరగడం, హాస్టళ్లలో మెరుగైన మెనూ అమలు చేయాలని భావించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జూన్ 1వ తేదీ నుంచే పెంచిన డైట్ చార్జీలు అమలు చేయాలని గతంలోనే ఉత్తర్వులు ఇచ్చింది.

కొత్త మెనూపై కసరత్తు..

ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో అధికారులు పోషకాలతో కూడిన నూతన మెనూ అమలుపై కసరత్తు చేస్తున్నారు. గతంలో ఉన్న మెనూకు అదనంగా మరికొన్ని చేర్చి నూతన మెనూను హాస్టళ్ల పునఃప్రారంభం నుంచే అమలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

హాస్టళ్లలో పెరగనున్న అడ్మిషన్లు..

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర సంక్షేమ వసతి గృహాలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలు 27 ఉన్నాయి. ఒక్కో వసతి గృహంలో 100 సీట్లు ఉంటాయి. దీంతో జిల్లాలోని హాస్టళ్లలో 2,700 మందికి అవకాశం ఉంటుంది. గత విద్యా సంవత్సరం 27 హాస్టళ్లలో 1,368 మంది చదువుతున్నారు. ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు జరగాల్సి ఉంది. ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడంతో పాటు కొత్త మెనూ అందుబాటులోకి తీసుకురానుంది. అలాగే హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగు పరుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సారి అడ్మిషన్ల సంఖ్య భారీగా ఉండనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈక్రమంలో జిల్లాలోని హాస్టళ్లలో పూర్తిస్థాయి సీట్లు భర్తీ అవుతాయని భావిస్తున్నారు.

కాస్మొటిక్ చార్జీలూ పెంపు

కాస్మొటిక్ చార్జీలు మూడు నుంచి ఆరో తరగతి బాలురకు రూ.110 నుంచి రూ.160, బాలికలకు రూ.110 నుంచి రూ.130, ఏడు నుంచి పదో తరగతి చదువుతున్న బాలురకు రూ.125 నుంచి రూ.150, బాలికలకు రూ.160 నుంచి రూ 200, ఇంటర్ ఆపైన విద్యార్థులకు రూ.125 నుంచి రూ.200, విద్యార్థినులకు రూ.160 నుంచి రూ.200కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ప్రభుత్వం విద్యార్థుల కోసం మంచి నిర్ణయం తీసుకుంది. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచడం వల్ల మాకు మంచి భోజనం అందుతుంది. మాలాంటి వాళ్ల గురించి ఆలోచిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– గణేష్‌నాయక్ 10వ తరగతి, ఎనుములపల్లి పుట్టపర్తి

పేద విద్యార్థులకు వరం



ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచటం ద్వారా మాలాంటి పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. హాస్టళ్లలో ఇప్పటికే సౌకర్యాలు మెరుగుపడ్డాయి. రుచికరమైన భోజనం వడ్డిస్తే మేము కూడా హాయిగా చదువుకుంటాం.

– శివవంశీ, పదో తరగతి విద్యార్థి, ఎనుములపల్లి హాస్టల్, పుట్టపర్తి

ఈ నెల నుంచే అమలు చేస్తాం



జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులందరికి ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచింది. నూతన చార్జీలు ఈ నెల నుంచే అమలు చేస్తాం. జిల్లాలో 27 హాస్టళ్లు ఉండగా, ప్రస్తుతం 1,368 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా అడ్మిషన్‌లు జరగాల్సి ఉంది.

– శివరంగ ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ

బదిలీలకు 194 మంది దరఖాస్తు

అనంతపురం క్రైం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మునిసిపాలిటీలు, అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల్లో 194 మంది ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం విదితమే. దీంతో అడ్మిన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్, శానిటేషన్ పోస్టులకు మునిసిపల్ రీజనల్ డైరెక్టర్ పీవీవీఎస్ మూర్తి బదిలీలు నిర్వహించనున్నారు.

పుట్టగొడుగులు, తేనె ఉత్పత్తులతో రైతులకు ఆదాయం

- కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్ర



పుట్ట గొడుగులు, తేనే ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోరంట్ల: పుట్టగొడుగుల పెంపకం, తేనె ఉత్పత్తులపై రైతులు దృష్టి సారించి ఆర్థికంగా ఎదగాలని కేంద్ర రెవెన్యూ కార్యదర్శి అజయ్ మల్హోత్ర పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కలెక్టర్ అరుణ్‌బాబుతో కలసి మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్‌డైరెక్టు ట్యాక్సెస్ నార్కోటిక్స్ అకాడమీ (నాసిన్)ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్ట గొడుగుల పెంపకం, తేనే ఉత్పత్తులతో రైతులకు కలిగే లాభాలను వివరించారు. రైతులు ఉత్పత్తి చేసే పుట్ట గొడుగులు, తేనె ఉత్పత్తులను నాసిన్ అకాడమీ ద్వారా కొనుగోలు చేస్తామని నాసిన్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం నాసిన్ అకాడమీలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను సంజయ్ మల్హోత్రా పరిశీలించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ రంగనాయకులు, నాసన్ అకాడమీ ప్రతినిధులు, స్థానిక సర్పంచ్ గంగప్ప పాల్గొన్నారు.

బోధనాస్పత్రికి మహర్దశ



అనంతపురంలోని బోధనాస్పత్రి

- అనాటమీ విభాగానికి 9 పీజీ సీట్లు మంజూరు
- 87కు చేరిన పీజీ సీట్ల సంఖ్య
- రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందే అవకాశం

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలోని బోధనాస్పత్రి (సర్వజనాస్పత్రి– వైద్య కళాశాల)కి మహర్దశ వచ్చింది. అనాటమీ విభాగానికి కొత్తగా తొమ్మిది పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) సీట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పీజీ సీట్ల సంఖ్య 87కు చేరింది. 2000 సంవత్సరం ఏప్రిల్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటైంది. గత ప్రభుత్వంలో అరకొరగానే పీజీ సీట్లు మంజూరయ్యాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వైద్య రంగంలో చేపట్టిన విప్లవాత్మక మార్పులతో ఊహాకందని రీతిలో 50కి పైగా పీజీ సీట్లు వచ్చాయి. ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్, పెథాలజీ, ఎస్‌పీఎం, ఫిజియాలజీ, అనాటమీ, బయో కెమిస్ట్రీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, ఓబీజీ, సైకియాట్రీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, అనస్తీషియా, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ విభాగాలకు పీజీ సీట్లు వచ్చాయి. ఇక రేడియాలజీ, పల్మనాలజీ విభాగాలకు మాత్రమే మంజూరు కావాల్సి ఉంది. వీటికి కూడా రెండు, మూడు నెలల్లో మంజూరయ్యే అవకాశం ఉంది. ఇవి కూడా వస్తే పీజీ సీట్ల సంఖ్య వందకు చేరుతుందని అధికారులు చెబుతున్నారు. పీజీ సీట్లు పెద్దసంఖ్యలో రావడం వల్ల నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుంది. పేదలకు మరింత నాణ్యమైన వైద్యం అందించేందుకు వీలు కలుగుతుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు.

గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షకు 75.09 శాతం మంది హాజరు

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో మూడో రోజు మంగళవారం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షకు 75.09 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 552 మంది అభ్యర్థులకు గానూ 392 మంది హాజరయ్యారు. 130 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ఈనెల 10 వరకు జరగనున్నాయి.

వెటర్నరీ అంబులెన్స్‌లో ఉద్యోగావకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల (మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్) వాహనాల పరిధిలో ఖాళీగా ఉన్న పైలట్లు (డ్రైవర్లు), పశువైద్యులు, పారాస్టాఫ్ పోస్టుల కోసం అర్హత, ఆసక్తి ఉన్న వారు సంప్రదించాలని ఇన్‌చార్జ్ ముస్తాక్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1962 హెల్ప్‌లైన్ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో నియోజకవర్గానికి రెండు చొప్పున మొబైల్ వెటర్నరీ అంబులేటరీ వాహనాలు సేవలు అందిస్తున్నాయన్నారు. మరిన్ని వివరాలకు 81256 38308, 91549 70184 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆగని దౌర్జన్య కాండ

- ముదిగుబ్బ బైపాస్ పనుల నాణ్యత పరిశీలనకు వచ్చిన అధికారుల ల్యాప్‌టాప్ అపహరణ
- భోజన సమయంలో హోటల్‌లో ఉన్న అధికారుల నుంచి ల్యాప్‌టాప్ తస్కరించిన దుండగుడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మైనింగ్ అండ్ విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి



ల్యాప్‌టాప్ అపహరణపై ముదిగుబ్బ సీఐకి ఫిర్యాదు చేస్తున్న మైనింగ్ అండ్ విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి

ధర్మవరం: ముదిగుబ్బ మండలంలో జరుగుతున్న బైపాస్ రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించేందుకు వచ్చిన మైనింగ్ అండ్ విజిలెన్స్ అధికారులపై దౌర్జన్యం కొనసాగుతూనే ఉంది. మొన్నటికి మొన్న బైపాస్ రోడ్డు పనుల నాణ్యత పరిశీలించేందుకు వచ్చిన అధికారులపై మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి అనుచరులు దౌర్జన్యానికి దిగిన విషయం మరువకముందే మంగళవారం మరో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. మైనింగ్ అండ్ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఉదయం నుంచి పనులను పరిశీలించారు. తర్వాత ముదిగుబ్బ మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో భోజనానికి వెళ్లారు. అక్కడ భోజనం చేస్తుండగానే పక్కనే ఉంచుకున్న నల్లబ్యాగులోని ల్యాప్‌టాప్‌ను ఆగంతకుడు ఎత్తుకెళ్లాడు. అవాక్కయిన అధికారులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. మైనింగ్ అండ్ విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) విజయలక్ష్మి స్వయంగా ముదిగుబ్బ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ కంబగిరి రామునికి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు హోటల్లోని సీసీ కెమెరా ఫుటేజీని, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నారు. నిందితుణ్ని త్వరలోనే పట్టుకుని ల్యాప్‌టాప్ రికవరీ చేస్తామని సీఐ తెలిపారు.

ఆ అవసరం ఎవరికి ఉంది?

విజిలెన్స్ అధికారులు విచారణ చేసిన తర్వాత వివరాలను ల్యాప్‌టాప్‌లో నిక్షిప్తం చేసుకున్నారు. దీంతో ఆ ల్యాప్‌టాప్ అపహరణకు గురికావడం చర్చనీయాంశంగా మారింది. బైపాస్ పనులలో నాణ్యతా లోపాలు బయటపడతాయన్న ఉద్దేశంతో కాంట్రాక్టు సంస్థకు సంబంధించిన వారే ఈ పని చేసి ఉండొచ్చన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచారణ సమయంలో సదరు సంస్థ సిబ్బంది అధికారులను అడ్డుకోవడం, దౌర్జన్యానికి దిగడం వంటి అంశాలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. పోలీసులు సకాలంలో ల్యాప్‌టాప్ రికవరీ చేయకపోతే అందులోని ఆధారాలు ధ్వంసం చేసే ప్రమాదం ఉంది.

వారం రోజుల్లో పునాదులు పడాలి



లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాల ప్రగతిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- ఇళ్ల లబ్ధిదారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం
- నిర్మాణాలు ప్రారంభించకపోతే రద్దు చేస్తామని హెచ్చరిక

పుట్టపర్తి అర్బన్: ''జగనన్న కాలనీలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించింది. ఉచితంగా స్థలం ఇచ్చి ఇల్లు మంజూరు చేసింది. చాలా మంది ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు చేశారు. అయినా మీరు ఇంకా పునాదులు కూడా తీయలేదు. మీకు వారం రోజులు గడువిస్తున్నా. ఆలోపు పునాదులు వేయకపోతే... ఇళ్లు రద్దు చేసి మరొకరికి ఇస్తాం'' అని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి కేజీబీవీ లేఅవుట్‌ను సందర్శించారు. ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. గడువులోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ..జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని, ఎక్కడైనా పనులు మిగిలిపోయి ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట మండల స్పెషలాఫీసర్ రాజశేఖరరెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ కరుణాకర్, డీఈ సమీర్‌బాషా, ఏఈ గౌస్‌మోదీన్, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్చ్.. మీ పనితీరు బాగోలేదు

ఐసీడీఎస్ అధికారులపై కలెక్టర్ అరుణ్‌బాబు అసహనం

పుట్టపర్తి అర్బన్: ''బుక్కపట్నం, కదిరి వెస్ట్, ధర్మవరం, గాండ్లపెంట, తనకల్లు, ఓడీసీల్లో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు సరిగా లేదు. సీడీపీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. ఇకపై పనితీరు మార్చుకోవాలి. బుధవారం నాటికి నిర్దేశిత లక్ష్యాల సాధనలో కొంతైనా పురోగతి చూపాలి'' అని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని కోర్టు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ నెల 8వ తేదీన (గురువారం) రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని, ఆలోపు జిల్లాలోని అన్నిశాఖల అధికారులు సమగ్ర సమాచారంతో నివేదికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల నిర్దేశిత లక్ష్యాల సాధనకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. లక్ష్య సాధనలో పురోగతి లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఈ క్రమంలోనే ఐసీడీఎస్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అలాగే ధర్మవరం అర్బన్, కదిరి అర్బన్, పుట్టపర్తి అర్బన్, హిందూపురం అర్బన్, గోరంట్ల, మడకశిర మండలాల్లోనూ పనులు పురోగతి సరిగా లేదన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చిన్నపిల్లలు, బాలికల్లో రక్తహీనత, పోషకాహార లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు, 10 నుంచి 19 ఏళ్లలోపు బాలికల్లో రక్త హీనత, పోషకాహారలోపం లేకుండా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి అంగన్‌వాడీ, పాఠశాలల్లో పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలన్నారు. అలాగే గిరిజన సంక్షేమం, మహిళా శిశు సంక్షేమంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బడి మానేసిన చిన్నారులపై దృష్టి సారించి వారందరికీ స్కూళ్లలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లోని మరుగుదొడ్ల వినియోగంలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఇక 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు ద్వారా గుర్తించిన 133 పనులకు ఆమోదం తెలిపామన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, నోడలాఫీసర్ శివారెడ్డి, జిల్లా కోర్డినేటర్ యవవాణి తదితరులు ఉన్నారు.

అనంత యువకుడు సౌదీలో ఆత్మహత్య

- కుమారుడి మరణవార్త విని కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



దాదాపీర్ (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఉద్యోగం కోసం సౌదీ అరేబియాకు వెళ్లిన ఓ యువకుడు ఏమైందో తెలియదుగానీ అక్కడ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం చేరడంతో వారు కన్నీరు మున్నీరవుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నగరంలోని రంగస్వామి నగరుకు చెందిన షేక్ దాదాపీరా, ఖాదర్‌బీ దంపతులకు షామీర్, దాదాపీర్(23) అనే ఇద్దరు కుమారులు. మూడు నెలల క్రితం వీసా తీసుకుని సౌదీలో ఉద్యోగాన్వేషణకు వెళ్లారు. షామీర్‌కు వెంటనే ఉద్యోగం దొరికింది. దాదాపీర్‌కు రెండు రోజుల క్రితం ఉద్యోగం లభించింది. ఇంతలోనే ఏం జరిగిందో తెలియదుగాని ఇంట్లో ఎవరూ లేని సమయంలో దాదాపీర్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గుర్తించిన సోదరుడు షామీర్ విషయాన్ని అనంతపురంలోని తల్లిదండ్రులకు చేరవేశాడు. దీంతో వారు గుండెలవిసేలా రోదించారు. 'అమ్మా.. వెళ్లొస్తానని నవ్వుతూ ఇంటి నుంచి వెళ్లితివి. ఇంతలోనే ఏమైంది బిడ్డా!' అంటూ ఖాదర్‌బీ కన్నీరు మున్నీరైంది.



దాదాపీర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

ఎమ్మెల్యే అనంత పరామర్శ..

దాదాపీర్ కుటుంబ సభ్యులను అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ప్రభుత్వంతో మాట్లాడి దాదాపీర్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా ఇక్కడికి రప్పిస్తామన్నారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. దాదాపీర్ మృతదేహాన్ని అనంతకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న అధికారులు

బత్తలపల్లి: అక్రమంగా కర్ణాటకకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీఎస్‌డీటీ శారద తెలిపిన మేరకు.. అందని విశ్వసనీయ సమాచారంతో విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్, సిబ్బంది ఈశ్వరయ్య, వీఆర్వో సాకే ప్రసాద్ తదితరులు మంగళవారం ఉదయం బత్తలపల్లి మండలం సంగాల గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద బియ్యం లోడుతో బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న బొలెరో వాహనాన్ని గుర్తించి, సీజ్ చేశారు. 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, బియ్యం అక్రమ రవాణా చేస్తున్న సంగాల గ్రామానికి చెందిన నవీన్, లక్ష్మీనారాయణపై ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, 1955 సెక్షన్ 6(ఏ) కింద కేసు నమోదు చేసి, క్రిమినల్ చర్యలు చేపట్టాలంటూ పోలీసులకు అప్పగించారు.

బాల్య వివాహాలు పూర్తిగా అరికట్టాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి

పుట్టపర్తి అర్బన్: బాల్య వివాహాల కలిగే అనర్థాలపై ప్రజలను చైతన్య పరిచి, వాటిని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సిబ్బందికి ఆ శాఖ పీడీ లక్ష్మీకుమారి, దిశ ఎస్‌ఐ ఇక్బాల్ సూచించారు. బాల్య వివాహాల నివారణపై మంగళవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలికావిద్యను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. బాలికల చదువు-సమాజానికి వెలుగన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తూ బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓలు గాయత్రి, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ మహేష్, సూపర్‌వైజర్లు, పుష్ప, భారతి కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖలో బదిలీలకు గ్రహణం

అయ్యవారు లేరని అమావాస్య ఆగిందనే నానుడి తపాలా శాఖకు సరిగ్గా సరిపోయేలా ఉంది. దేశ వ్యాప్తంగా తపాలా ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయినా ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాత్రం ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఇది ఆ శాఖ ఉద్యోగుల్లో అసహనం పెంచుతోంది.

- షెడ్యూల్ గడువు ముగిసినా ముందుకు సాగని ప్రక్రియ
- పట్టించుకోని ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్
- తపాలా ఉద్యోగుల్లో పెరుగుతున్న అసహనం



తపాలా శాఖలో బదిలీల షెడ్యూల్ ఇలా	
నోటిఫికేషన్ జారీ	4.5.2023
దరఖాస్తుల సమర్పణ	12.05.2023
ఆప్షన్ల ఎంపిక	19.05.2023
బదిలీల కౌన్సెలింగ్	26.05.2023
బదిలీ అయిన ప్రదేశంలో జాయినింగ్	30.05.2023

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో తపాలా శాఖకు సంబంధించి రెండు డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్‌కు ఒక్కో సూపరింటెండెంట్ ఉంటారు. సబ్ పోస్ట్ మాస్టర్లు, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ల బదిలీలన్నీ వారి ఆధ్వర్యంలోనే జరగాల్సి ఉంది. అయితే ఈసారి మాత్రం బదిలీల ప్రక్రియ ఆగిపోయింది. ఇందుకు అనంతపురం డివిజన్‌కు రెగ్యులర్ సూపరింటెండెంట్ లేకపోవడం ఓ కారణమైతే, హిందూపురం డివిజన్ సూపరింటెండెంట్ తన బిడ్డ పెళ్లి కోసం సెలవులో వెళ్లడంతో అక్కడా బదిలీల ప్రక్రియ ఆగిపోయింది.

గత నెల 4న నోటిఫికేషన్ జారీ

తపాలా శాఖలో ఒకే స్టేషన్‌లో ఆరేళ్లు, మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారందరినీ బదిలీ చేయాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు సంబంధించిన సీనియారిటీ జాబితా సైతం రూపొందించారు. సబ్ పోస్ట్‌మాస్టర్లు, పోస్టల్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులు ఇలా అన్ని విభాగాలకు సంబంధించిన వారి సీనియారిటీ జాబితా తయారు చేసి ప్రకటించారు. అనంతరం బదిలీలకు గత నెల 4న నోటిఫికేషన్ జారీ చేశారు. దరఖాస్తుల సమర్పణకు అదే నెల 12వ తేదీ ఆఖరు కాగా, 26వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీ అయిన ఉద్యోగులు 30వ తేదీలోపు ఆయా స్థానాల్లో బాధ్యతలు స్వీకరించేలా షెడ్యూల్ ప్రకటించారు.

ఇన్‌చార్జ్‌కు పట్టని బదిలీల ప్రక్రియ

కొన్నేళ్లుగా అనంతపురం డివిజన్‌కు రెగ్యులర్ సూపరింటెండెంట్ లేకపోవడంతో గుంతకల్లు అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన చుట్టపు చూపుగా వచ్చి వెళ్తుండడంతో ఇక్కడ పరిపాలన పూర్తిగా గాడి తప్పింది. దీంతో బదిలీల కోసం నిరీక్షిస్తున్న ఉద్యోగుల మొర ఆలకించేవారు కరువయ్యారు. దీనిపై ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. షెడ్యూల్ మేరకు బదిలీల ప్రక్రియ జరగని విషయాన్ని ఆ శాఖ కర్నూలు రీజియన్ అధికార్లులు సైతం పట్టించుకోకపోవడంపై తపాలా ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం అనంతపురం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్‌గా హరిబాబు బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఇప్పటికైనా బదిలీ ప్రక్రియ మొదలవుతుందనే ఆశ ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

సెలవులో 'పురం' ఎస్పీ

తన బిడ్డ పెళ్లి ఉందంటూ హిందూపురం డివిజన్ ఎస్పీ సెలవులో వెళ్లిపోయారు. ఆయన ఈ నెల 14వ తేదీ వరకూ సెలవు ఉంటారు. దీంతో అక్కడ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఫలితంగా కోరుకున్న చోటుకు బదిలీ చేయించుకుని వెళ్లాలని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది.

విద్యా సంవత్సరం దగ్గరపడుతున్నా..

పాఠశాలలు, కళాశాలలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల వారు ఫోన్ల మీద ఫోన్లు చేస్తూ పిల్లల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సెలవులు ముగియకనే కోరుకున్న చోటుకు వెళ్లి పిల్లలను మంచి పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. అయితే బదిలీలు కాకపోవడంతో వారిలో టెన్షన్ అంతకంతకూ పెరిగిపోతోంది. తపాలా శాఖ ఉద్యోగులు అసహనంతో రగిలిపోతున్నారు.

బదిలీల ప్రక్రియ వెంటనే మొదలుపెట్టాలి



బదిలీలన్నీ మే 26 నాటికి పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించింది. అయినా ఉమ్మడి అనంత జిల్లాలోని డివిజన్లలో బదిలీల ప్రక్రియ ఆగిపోయింది. దీంతో పిల్లల చదువులపై ఉద్యోగుల్లో ఆందోళన పెరిగిపోతోంది. వెంటనే బదిలీల ప్రక్రియ మొదలుపెట్టాలి. లేదంటే ఆందోళనకు దిగుతాం.

– కె.బ్రహ్మానందరెడ్డి, డిప్యూటీ సర్కిల్ సెక్రటరీ, భారతీయ పోస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (బీపీఈఏ), అనంతపురం

పురం అభివృద్ధికి నిధులు కోరిన ఎమ్మెల్సీ ఇక్బాల్



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్, కొండూరు వేణుగోపాలరెడ్డి, శెట్టిపల్లి జగన్

హిందూపురం: హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హిందూపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కోరారు. పార్టీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల రెడ్డి, శెట్టిపల్లి జగన్‌మోహన్‌రెడ్డితో కలసి మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని ఆయన కలిశారు. హిందూపురం రాజకీయ పరిణామాలను వివరించారు.

వర్షబాధిత రైతులకు పరిహారం అందజేయండి

- కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

పుట్టపర్తి అర్బన్/ధర్మవరం: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ధర్మవరం నియోజకవర్గంలో పంట నష్టపోయిన రైతులకు సత్వర సాయం అందించేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబుకు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి విన్నవించారు. ఈ మేరకు కలెక్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఎమ్మెల్యే కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. చుక్కల జాబితాలో ఉన్న పట్టణంలోని సిద్దయ్యగుట్ట, జోగోని కుంట, సాయినగర్ తదితర కాలనీల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు చర్యలు తీసుకోవాలని కోరారు. గత ఏడాది తిరుపతి సమీపంలోని బాక్రాపేట వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన ధర్మవరం వాసుల కుటుంబాలకు కేంద్రం ప్రకటించిన రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని అందించేలా చొరవ తీసుకోవాలని విన్నవించారు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలకు ప్రభుత్వం నుండి సాయం అందేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి



డీపీటీఓకు వినతి పత్రం అందజేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీఓ) మధుసూదన్‌ను ఎన్ఎంయూ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్ఎం కార్యాలయంలో డీపీటీఓను కలసి వినతిపత్రం అందజేశారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గుర్తించినప్పటికీ కొందరు అధికారులు తోటి ఉద్యోగులపై వివక్ష చూపుతూ నోరు పారేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆరు డిపోల్లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పలుమార్లు దృష్టికి తీసుకొచ్చినా పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. డ్రైవర్లు, కండెక్టర్లు, డ్యూటీ చార్టులు సక్రమంగా అమలయ్యేలా చొరవ చూపాలని కోరారు. పుట్టపర్తి డిపో నుంచి విజయవాడకు వెళ్లే సర్వీసులకు డీజల్ నింపే విషయంలో ఇబ్బందులు ఉన్నాయని, అన్ని డిపోలలో ఏడీసీలను నిబంధనల మేరకు మార్పు చేయాలని, పీఆర్సీ, అరియర్స్, ఏఎస్ ఇంక్రిమెంట్లు, వాటి అరియర్స్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా ప్రతి మంగళవారం అన్ని కార్యాలయాల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలనే ఆదేశాలు అమలు కావడం లేదన్నారు. మహిళా ఉద్యోగులకు రెస్ట్ రూములు ఏర్పాటు చేయాలని, పెనుకొండ డిపోలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. స్పందించిన డీపీటీఓ... ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి షబ్బీర్, నాయకులు పాల్గొన్నారు

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతుల సురేష్



మాట్లాడుతున్న పోతుల సురేష్

కదిరి టౌన్/అర్బన్: రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందని సామాజిక ఉద్యమ నాయకుడు, వైఎస్సార్‌సీపీ నేత పోతుల సురేష్ స్పష్టం చేశారు. కదిరిలోని ఆర్య వైశ్య కల్యాణ మంటపంలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయులకు సన్మానం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయం ముందున్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వంకదార రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కలవల రామ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తన భార్య పోతుల సునీతకు రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ.200 కోట్ల బడ్జెట్ కేటాయించే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు గుర్తు చేశారు. ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యతతో పాటు నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి పక్కాగృహాలు నిర్మించేలా ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. అనంతరం పోతుల సురేష్‌ను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, సెక్రటరీ సాధు ప్రతాప్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడా వరప్రసాద్, కార్యదర్శి ఆనందబాబు, ట్రెజరరీ జనార్ధన్ గుప్త, సంఘం నాయకులు, అనుబంధ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి తరలింపుదారు పరారీ!

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసుల అదుపులో ఉన్న గంజాయి తరలింపుదారు.. చివరి క్షణంలో తప్పించుకుని పారిపోయాడు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. నాలుగు రోజుల క్రితం అనంతపురంలో గంజాయి దిగుమతి చేస్తూ ఓ వ్యక్తి జిల్లా పోలీసు ప్రత్యేక బృందానికి పట్టుబడ్డాడు. విచారణలో తన నేరాన్ని ఆ వ్యక్తి అంగీకరిస్తూ తనతో పాటు తీసుకువచ్చిన 10 కిలోల గంజాయిని స్వాధీనం చేశాడు. దీంతో గంజాయితో పాటు నిందితుడిని అనంత శివారులోని పోలీసు స్టేషన్‌లో ప్రత్యేక బృందం అప్పగించింది. అప్పటి నుంచి ఈ కేసులో సదరు పోలీస్ స్టేషన్ అధికారులు మరింత లోతు విచారణ చేపట్టారు. ఈ తంతు కూడా దాదాపు పూర్తి కావస్తుండడంతో ఇక అరెస్ట్ చూపించాలని అనుకుంటున్న చివరి క్షణంలో పోలీసుల కళ్లు గప్పి నిందితుడు స్టేషన్ నుంచి పారిపోయాడు. ఆలస్యంగా గుర్తించిన పోలీసులు ఈ విషయాన్ని ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లడంతో వారిపై ఎస్పీ శ్రీనివాసరావు సీరియస్ అయినట్లు సమాచారం. ఎస్పీ ఆదేశాలతో నిందితుడిని పట్టుకుని వచ్చేందుకు రెండు బృందాలుగా విడిపోయిన పోలీసులు ఓ బృందం యూపీకి, మరో బృందం బెంగళూరుకు వెళ్లినట్లు తెలిసింది. కాగా, ఈ విషయాన్ని పోలీస్ అధికారులు అత్యంత గోప్యంగా ఉంచడం గమనార్హం.

క్రీడలతో చెడు అలవాట్లు దూరం

- ఎస్ఎస్ఏ జిల్లా మానిటరింగ్ అధికారి మహేంద్రరెడ్డి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ప్రతి విద్యార్థికీ చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమని, క్రీడలతో చెడు అలవాట్లు దూరమవుతాయని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సమగ్ర శిక్ష అకడమిక్ జిల్లా మానిటరింగ్ అధికారి మహేంద్రరెడ్డి సూచించారు. మంగళవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి కేజీబీవీలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం జీ20లో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమై మాట్లాడారు. క్రమశిక్షణ పేరుతో పిల్లలను ఎక్కువగా శిక్షించరాదన్నారు. రోజూ తప్పని సరిగా విద్యాభ్యాసం చేయించాలన్నారు. ఆటపాటలను ప్రోత్సహించడం ద్వారా పిల్లలు చెడు అలవాట్లకు లోను కాకుండా ఉంటారన్నారు. అనంతరం విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం, రంగోలి, క్విజ్, కథలు చెప్పడం, వక్తృత్వ, చిత్రలేఖనం, పద్య పఠనం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని జన్‌భాగీదార్ కార్యక్రమంలో భాగంగా విజయవాడ వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు శంకరప్ప, రమణారెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గడువు ముగిసినా.. బదిలీలా?

- ఆడిట్ ఉద్యోగుల ఆందోళన



అనంతపురంలోని ఆడిట్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

అనంతపురం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం విధించిన గడువు తీరిన తర్వాత ఉద్యోగుల బదిలీలు ఎలా చేస్తారంటూ ఉమ్మడి జిల్లాకు చెందిన ఆడిట్ ఉద్యోగులు ఏపీ ఎన్జీఓ సంఘం ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆ శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్(ఎఫ్ఏసీ) హరిప్రకాష్ జోక్యాన్ని తప్పుబట్టారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ట్రెజరర్ బషీర్ అహమ్మద్, నగర ట్రెజరర్ విష్ణువర్ధన్ తదితరులు మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గత నెల 22 నుంచి 30వ తేదీలోపు బదిలీల ప్రక్రియను కర్నూలులోని రీజనల్ డైరెక్టర్ పూర్తి చేశారని గుర్తు చేశారు. అయితే ఆ బదిలీలను హరిప్రకాష్ రద్దు చేయడమే కాక, ఇష్టారాజ్యంగా బదిలీలు చేసి, పాత తేదీలతో రూపొందించిన ఉత్తర్వులను ఈ నెల 3న జారీ చేయడంపై మండిపడ్డారు. బదిలీలకు అర్హులు కాని వారిని, కనీసం రిక్వెస్ట్ లెటర్లు కూడా పెట్టని వారిని, ఏడాది కూడా ఒక చోట పని చేయని వారిని సహేతుకమైన కారణాలు లేకుండా ఎలా బదిలీ చేస్తారంటూ ప్రశ్నించారు. ఉద్యోగులపై కక్ష సాధింపు కోసమే డైరెక్టర్ ఇలా వ్యవహరించారని, నిబంధనలకు విరుద్ధంగా సాగిన బదిలీలను రద్దుచేయకపోతే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు మంగళవారం రాత్రికే విజయవాడ బయలుదేరి వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఆడిట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీలు అజయ్‌కుమార్, దస్తగిరి, సభ్యులు, ఆడిట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

హోరాహోరీగా గిరకబండి లాగుడు పోటీలు



గిరక బండిని లాగుతున్న ఎద్దులు

విడపనకల్లు: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని విడపనకల్లు మండలం ఉండబండలోని గ్రామ సచివాలయ వలంటీర్ల ఆధ్వర్యంలో మంగళవారం గిరకబండి లాగుడు పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో అదే గ్రామానికి చెందిన ఎనిమిది జతల ఎద్దులు పాల్గొన్నాయి. పదిహేను నిమిషాల వ్యవధిలో రైతు పాల్తూరు హరికృష్ణకు చెందిన ఎద్దులు 2,813 అడుగుల దూరం బండిని లాగి ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాయి. ద్వితీయ స్థానంలో పల్లి పెద్దలింగప్ప ఎద్దులు, తృతీయ స్థానంలో ఆకుతోట రామాంజినేయులు ఎద్దులు, నాల్గో స్థానంలో పల్లి శ్రీనివాసులు ఎద్దులు, ఐదో స్థానంలో రవిచంద్ర ఎద్దులు నిలిచాయి. విజేత ఎద్దుల యజమానులకు వలంటీర్లు సొంతంగా నగదు పురస్కారాలను అందజేశారు. పోటీలో పాల్గొన్న మిగిలిన ఎద్దుల యజమానులకు కన్సొలేషన్ బహుమతులను ప్రదానం చేశారు. బహుమతుల ప్రదాన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుల పశువుల భాస్కర్, పశువుల ఓబులప్ప ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సాహించేందుకే ఈ పోటీని నిర్వహించినట్లు వలంటీర్లు శ్రీధర్, అశోక్ తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్లు గోపాల్, రాము, పవన్, బి.వన్నూరుస్వామి, చిదంబరం, లింగేష్, కిష్టప్ప, పి.వన్నూరుస్వామి, ప్రతాప్, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణారెడ్డి, సిబ్బంది

ప్రశాంతి నిలయం: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా స్వీకరించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో కలసి ఆయన మొక్కలు నాటి, మాట్లాడారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇంధన వినియోగం అధికం కావడంతో వాతావరణ కాలుష్యం పెరిగిందన్నారు. దీంతో గాలిలో మానవుని శ్వాస వ్యవస్థకు హాని చేసే చెడు పదార్థాలు పెరిగాయన్నారు. ఇప్పటికైనా మేల్కోకపోతే వాతావరణం పూర్తిగా కలుషితమై మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. డమాలజిస్ట్ బాలాజీ నాయక్, డాక్టర్ నివేదిత, డాక్టర్ నాగరాజునాయక్, సీహెచ్ఓ నాగేష్, పీహెచ్ఎన్ లలితకుమారి, డీసీఎం త్రిలోక్‌నాథ్, సూపర్‌వైజర్ రమణ, ఎంపీహెచ్ఏ శివయ్య,, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం



రమేష్ (ఫైల్)

ముదిగుబ్బ: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.... ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లికి చెందిన వడ్డే రమేష్ (35) పాల డెయిరీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం సొంత పనిపై బత్తలపల్లికి వెళ్లిన ఆయన మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ముదిగుబ్బ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మట్కా బీటర్ల అరెస్ట్

కదిరి టౌన్: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో మట్కా రాస్తున్న ఇద్దరు బీటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో కదిరికి చెందిన అల్లాబకాష్, అయూబ్ ఉన్నారని సీఐ మధు తెలిపారు. మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టిన సమయంలో బీటర్లు పట్టుబడ్డారన్నారు. నిందితుల నుంచి రూ.40వేలు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. బీటర్లపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.